క్లుప్తంగా

జోరుగా ఎన్నికల ప్రచారం



మచిలీపట్నంటౌన్‌: వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నగరంలోని పలు డివిజన్లలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జోరుగా ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. బ్యాలెట్‌ నమూనా పత్రాలతో పాటు కరపత్రాలను పంచి మోడల్‌ ఈవీఎంలో మూడో నంబరులో ఉన్న ఫ్యాన్‌ గుర్తుకు ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్‌ గుర్తుపై రెండు ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్‌: మోడ్రన్‌ ఐ కేర్‌ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఆదివారం ఫ్యాన్స్‌ ఇంగ్లిషుపాలెం గొనెప్పి మసీదు ఆవరణలోని మదరసాలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మోడ్రన్‌ ఆప్టికల్స్‌ క్వాలిఫైడ్‌ ఆప్టీషియన్‌ మొహమ్మద్‌ నియాజ్‌ తెలిపారు. శుక్రవారం రాజా గారి సెంటరులోని కంటి ఆసుపత్రి వద్ద వైద్యశిబిర కరపత్రాలను వైద్యుడు భానుమూర్తితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే వైద్య శిబిరంలో వైద్యసేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎండీ యూనస్‌ పాల్గొన్నారు.

సంస్కరణవాది జగన్‌



వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): గొప్ప సామాజిక సంస్కరణవాది జగన్‌మోహన్‌రెడ్డి అని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ నేత అంబటి శ్రీహరి ప్రసాద్‌(హరిబాబు) చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆయన స్వగ్రామం వక్కపట్లవారిపాలెం పరిధిలోని దళితవాడలైన ఎస్టీఆర్‌ కాలనీ, బ్రహ్మానందపురం కాలనీ ప్రజలతో మమేకమై నియోజకవర్గ యువనేత సింహాద్రి వికాస్‌తో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ ఎన్నికల నవ్య మేనిఫెస్టోను కాలనీల పెద్దలు, మహిళలు, యువతకు వారు వివరించారు. హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్నను, అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు, బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ చంద్రశేఖర్‌లను మీరు గెలిపించండి, మీ అభ్యున్నతి వారే చూసుకుంటారంటూ భరోసా ఇచ్చారు. నీతిని ఊపిరిగా ఉన్న విద్యా గౌరవంగా అవనిగడ్డ గ్రామాభివృద్ధి బాటలు వేస్తుందంటూ13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేసి అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులు సింహాద్రి జోడిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. యువనేత వికాస్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో దశాబ్దాలుగా పని చేస్తూ వచ్చిన ముఖ్యమంత్రుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగులు, పేదవర్గాలను ఎవరు ఆదుకున్నారో ఆలోచించాలని కోరారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు నేతృత్వంలో జరిగిన సమావేశాల్లో రాష్ట్ర కాపు కార్పొరేషన్‌ డైరెక్టర్‌ మల్లి దిన్నారు, దళిత నేతలు దాసి జీవరత్నం(గణేశ్వరం మాజీ సర్పంచ్‌), గుంటూరు సురేష్‌, ఎడురుమొండి ఎంపీటీసీ నాగప్రసాద్‌, పీఏసీఎస్‌ అధ్యక్షుడు సాయిబాబు, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రం



అవనిగడ్డ: ఎటుచూసినా జగనే అన్నట్టుందికదా ఈ చిత్రం చూస్తే. అవనిగడ్డ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆధ్వర్యంలో మూడు మండలాల్లో శుక్రవారం మెగా రోడ్‌ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి ఎంట్రన్స్‌లో ర్యాలీ కోసం ఎదురు చూస్తుండగా ఓ బస్సుకు ఉంచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుని నిలబడ్డారు. అంతకు ముందు కురిసిన వర్షం నీటిలో జగన్‌ చిత్రం నీడ స్పష్టంగా కనపడుతోంది.

అవనిగడ్డ.. అభివృద్ధి ఘనం

- ఐదేళ్లలో 334.78కోట్లతోపనులు
- నాడు నేడు ద్వారా రూ.53.90 కోట్లతో పాఠశాలల అభివృద్ధి
- అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్‌ కేంద్రం
- 83.89 కోట్లతో రహదారుల నిర్మాణం
- రూ.109 కోట్లతో ఎదురుమొండి వారధికి టెండర్లు



నాడు.. కోడూరు - పోటుమీద మధ్య అధ్వానంగా ఉన్న రహదారి



నేడు.. కోడూరు - పోటుమీద మధ్య పూర్తయిన నాలుగు లైన్ల రహదారి

అవనిగడ్డ: మాటల్లో కాదు.. అభివృద్ధిని చేతల్లో చేసి చూపించారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 334.78 కోట్ల మేర అభివృద్ధి పనులు చేసింది. నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్‌ సెంటర్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, ఎదురుమొండి వారధి నిర్మాణానికి టెండర్లు, అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్‌ కేంద్రం ఏర్పాటు. ఇవన్నీ ప్రతిపక్ష పార్టీలకు అభివృద్ధిలా కనబడటం లేదు. కళ్లులేని కబోదిలా వ్యవహరిస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అవనిగడ్డ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రత్యేక కథనం.

రూ.53.90 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి

సీఎం జగన్‌ పాలనలో అవనిగడ్డ నియోజకవర్గంలో 53.90 కోట్ల మేర నాడు - నేడు పథకం ద్వారా పాఠశాలలను తొలి విడతగా ఫేస్‌ -1లో రూ.23.34 కోట్లు విలువైన పనులు చేపట్టారు. రెండో ఫేస్‌లో రూ.30.56 కోట్లు విలువైన పనులు చేపట్టారు. విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. వాటిని వినియోగించుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

రూ.83.89 కోట్లతో రోడ్ల అభివృద్ధి

ఐదేళ్లలో రూ.83.89 కోట్లతో రహదారులను అభివృద్ధి చేశారు. అవనిగడ్డ-కోడూరు ప్రధాన రహదారిని రూ.18.60 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.

రూ.42.02 కోట్లతో సచివాలయాలు, ఆర్‌బీకేలు



అవనిగడ్డ 2 సచివాలయ భవనం

ఆరు మండలాల్లో మొత్తం 91 పంచాయతీలు, 77 సచివాలయాలు ఉన్నాయి. ఐదేళ్లలో అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.42.02 కోట్లతో సచివాలయాలు, ఆర్‌బీకే కేంద్రాలను నిర్మించారు. రూ.35.38 కోట్లతో సచివాలయ భవనాలు, రూ.16.67 కోట్లతో రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) నిర్మించారు.

రూ.16 కోట్లతో కోడూరు నుంచి పోటుమీద, రూ.1.85 కోట్లతో వల్లపల్లి - నడకుదురు, రూ.2.50 కోట్లతో మోపిదేవి-చల్లపల్లి, రూ.2కోట్లతో నాగాయలంక- సొర్లగొంది, రూ. కోటితో నాగాయలంక - వి.కొత్తపాలెం, రూ.16.90 కోట్లు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పలు రహదారుల నిర్మాణం జరిగింది. రూ.13.18కోట్ల మేర రహదారి పనులకు టెండర్లు పూర్తై నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రూ.109 కోట్లు నాబార్డు నిధులతో చేపట్టనున్న ఎదురుమొండి వారధి మంజూరై టెండర్ల దశలో ఉంది.

8929 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాల కేటాయింపు

నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఐదేళ్లలో 8,929 లబ్ధిదారులకు నివేశన స్థలాలు కేటాయించారు. వీటికి సంబంధించి రూ. 25.10 కోట్లతో మెరక పనులు, రూ.30.23 కోట్లతో కాలనీల్లో రహదారులు ఏర్పాటు, రూ.1.31కోట్లతో అంతర్గత రహదారులు, కల్వర్టుల నిర్మాణం, రూ.5.28 కోట్లతో త్రాగునీటి సదుపాయం, రూ.6.72కోట్లతో విద్యుత్‌ సదుపాయం కల్పించారు.



నాడు.. కోడూరు మండలం రామకృష్ణాపురంలో ప్రాథమికోన్నత పాఠశాల భవనం



నేడు.. రామకృష్ణాపురంలో ప్రాథమికోన్నత పాఠశాల భవనం

రూ.32.68 కోట్లతో వైద్యశాలల అభివృద్ధి

నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో వైద్యశాలల ఆధునికీకరణ, ఆధునిక పరికరాల ఏర్పాటు, వైద్య ఖర్చుల కోసం మొత్తం రూ. 60.02 కోట్లు ఖర్చు చేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందాయి. అవనిగడ్డలో రూ.35లక్షలతో నిర్మించిన సీమాక్‌ సెంటర్‌లో డెలివరీలు చేసేందుకు అవసరమైన ప్రాంగణం ఉండేది. నాడు ఐదేళ్లలో ఈ కేంద్రంలో కేవలం 13 డెలివరీలు మాత్రమే చేయగా 2023లో 9 నెలల కాలానికి 78 డెలివరీలు చేశారు. పాముకాటు కేసులకు సరైన వైద్యసేవలు అందక గత ప్రభుత్వ హయాంలో మొత్తం 11 మంది మృత్యువాత పడ్డారు. ఈ నాలుగేళ్లలో ఒక్క పాముకాటు మృతి కేసు లేదు. రూ.3కోట్ల వ్యయంతో అవనిగడ్డలో సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. రూ.12 కోట్లతో 14 పీహెచ్‌సీలను అభివృద్ధి చేశారు. అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో గత ఏడాది రూ.1.40కోట్ల వ్యయంతో రెండు ఆధునిక జనరేటర్లు, సీమాక్‌ సెంటర్‌లో రూ.50లక్షల



అవనిగడ్డలో సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)

వ్యయంతో ఆధునిక స్కానింగ్‌ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని 14 పీహెచ్‌సీలకు రూ.6.28 కోట్లతో పరికరాలు ఏర్పాటు, ప్రహరీగోడల నిర్మాణం చేశారు. అవనిగడ్డలో కోవిడ్‌ సమయంలో 296 మంది పేషెంట్లకు వైద్యసేవలు అందించారు. అవనిగడ్డ ఏరియా వైద్యశాలలో ఆపోలో సహకారంతో డయాలసిస్‌ సెంటర్‌ని గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించారు. అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో రూ.50లక్షల వ్యయంతో జగనన్న ప్రాణవాయువు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పెడనలో ప్రచార హోరు



పెడన: నియోజకవర్గంలో వైఎస్సార్‌ సీపీ ప్రచారం జోరుగా సాగుతోంది. కొన్ని రోజులుగా ప్రతి కార్యకర్త, నాయకుడు, అభిమాని సైతం తమ తమ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఫ్యాన్‌ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరుతూ బ్యాలెట్‌ నమూనా చూపుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచారం శనివారం సాయంత్రంతో ముగుస్తుండటంతో వైఎస్సార్‌ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్‌(రాము), రాము భార్య జెడ్పీ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారికలతో పాటు రాము సోదరి అనూరాధ, కుటుంబసభ్యులతో కలిసి ఆయా మండలాల్లోని పట్టణ, మండలాలకు వెలసిన వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

-టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసి పోటీ చేస్తున్న విషయం విదితమే. టీడీపీలో ఐదేళ్లపాటు కృత్తివెన్ను మండలం లక్ష్మీపురంలో కొందరు వైఎస్సార్‌ సీపీ నుంచి చేరి భంగపడ్డారు. వీరిని బుజ్జగించాల్సింది పోయి ఉంచి ఉంచండి.. లేకుంటే పోండి అన్నట్లుగా సమాధానం. దీంతో వీరు అంత చెందిన సైలెంట్‌ అయ్యారు. టీడీపీ ప్రచార రథాల్లో బీజేపీ పేరు, నాయకుల పాటోలు కూడా లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

అనుమతులు లేని బాణసంచా స్వాధీనం

బంటుమిల్లి: స్థానిక సంత బజారులో అనుమతులు లేకుండా దీపావళి టపాసులు అమ్ముతున్న వ్యాపారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ జి. వాసు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులకు అందిన సమాచారం మేరకు స్థానిక సంత బజారులోని జాలారి నాగేశ్వరరావు కిరాణా షాపులో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు రూ.30వేల విలువ చేసే దీపావళి టపాసులు ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి లైసెన్సులు లేకపోవడంతో జాలారి నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ప్రభుత్వంలో బందరు అభివృద్ధి

ఎన్నికల ప్రచారంలో పేర్ని కిట్టు

కోనేరుసెంటర్‌: జగనన్న ప్రభుత్వంలో బందరు అభివృద్ధి చెందిందని వైఎస్సార్‌ సీపీ బందరు అభ్యర్థి పేర్ని కిట్టు(కృష్ణమూర్తి) చెప్పారు. మండలంలో శుక్రవారం పేర్ని (కృష్ణమూర్తి) కిట్టు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచార రథంపై గ్రామాల్లో ఓట్లను అభ్యర్థించారు. బందరు ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి మండల ప్రజలు అండగా నిలవాలని కోరారు. బందరు పోర్టు నిర్మాణం, ప్రభుత్వ వైద్య కళాశాల, బందరు హార్బర్‌ వంటి ప్రాజెక్టులు కలిగిన అభివృద్ధి పనులను వైఎస్సార్‌ సీపీ చేపట్టిందని గుర్తు చేశారు. బందరు ప్రాంత అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం 36 గ్రామాల్లో పోర్టు పేరుతో భూములను బలవంతంగా తీసుకోవాలని చూసిందన్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో అవసరం మేరకే భూములను తీసుకుని నిర్మాణం జరుపుతోందన్నారు. బందరు మరింత అభివృద్ధి చెందాలన్నా, ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి ఆవకా



ఎన్నికల ప్రచారంలో పేర్ని కిట్టుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కొత్తపూడి గ్రామస్తులు

శాలు మెరుగుపడాలన్నా, నిరుద్యోగులకు జీవన భృతి కల్పించాలన్నా, అక్క చెల్లెమ్మలు, అవ్వాతాతలను అన్ని విధాల ఆదుకోవాలన్నా వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యపడుతుందని గుర్తు చేశారు. ఈ నెల 13వ తేదీన జరిగే కురుక్షేత్ర యుద్ధంలో జగన్‌మోహన్‌రెడ్డికి మీరంతా మద్దతు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన తనను పెద్ద మనసుతో ఆశీర్వదించి విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మండల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఓటమి భయంతోనే దాడి

మోపిదేవి: బీసీలకు వెన్నుదన్నుగా ఉంటున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్‌ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్యపై దాడిని ఆ పార్టీ బీసీ, ఎస్సీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మోపిదేవిలో వారు విలేకరుల సమావేశంలో శుక్రవారం మాట్లాడారు. శ్రీకాకుళం నియోజకవర్గం ఏర్పాటులో గురువారం వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డికి మద్దతుగా కృష్ణయ్య ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంలో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారని ఈ ఘటనలో ఆయన చేతిపైన గాయాలయ్యాయన్నారు. టీడీపీ ఓడిపోతుందని ముందస్తుగా వారికి సంకేతాలు తెలియడంతో ఈ దురాగతానికి పాల్పడి ఎన్నికలను వాయిదా వేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నేతలపై దాడులు చేసే హేయమైన చర్యను ప్రజలు గమనిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీ మండల కన్వీనర్‌ రాజులపాటి నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి మొర్ల శ్రీనివాసరావు, ఎస్సీసెల్‌ మండల కన్వీనర్‌ బోడాబత్తిన పూర్ణచంద్రరావు, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ పర్వాడ రవి రాంప్రసాద్‌, జగదీష్‌ కుమార్‌, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మనకు సంక్షేమ ఫలాలు

పెడనలో జెడ్పీ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారిక విస్తృత ప్రచారం

పెడన: జగనన్న సీఎంగా ఉంటేనే మనకు సంక్షేమ ఫలాలు నేరుగా అందుతాయని, లేకుంటే అంతే సంగతులని వైఎస్సార్‌ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్‌(రాము) భార్య, జెడ్పీ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారిక అన్నారు. ఆమె పట్టణంలోని 10, 18, 19, 20, 11వ వార్డుల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించి గడప గడపకూ తిరుగుతూ కరపత్రాలను అందజేస్తూ రెండు ఓట్లు కూడా ఫ్యాన్‌ గుర్తుకు వేయాలని కోరుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను నేరుగా అందించిన ఘనత మన జగనన్నకే సాధ్యమైందన్నారు. వలంటీర్‌ వ్యవస్థను తీసుకువచ్చి అవ్వాతాతలకే కాకుండా పింఛన్లు పొందే ప్రతి ఒక్కరికీ కూడా ఇంటికి వెళ్లి ప్రతి నెల మొదటి తేదీ నగదు అందించే పరిస్థితి ఉండన్నారు. టీడీపీ తన తీరుతో అవ్వాతాతలను ఇబ్బంది పెడుతోందన్నారు. బ్యాంకుల వద్దకు వెళ్లి పింఛను తీసుకునేలా చేసిన ప్రభుత్వం కావాలో, ఇంటికి తీసుకువచ్చి పింఛను నగదు అందించే ప్రభుత్వం కావాలో గుర్తించి ఫ్యాన్‌ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. ప్రభుత్వ బడులు



పెడనలో ప్రచారం చేస్తున్న ఉప్పాల హారికకు హారతులు ఇస్తున్న మహిళలు

ఎంతో అందంగా తీర్చిదిద్దడమే కాకుండా ఇంగ్లిష్‌లో పాఠాలు బోధిస్తున్నారని, ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు మారాయని, ఈ ఘనత కూడా మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే నన్నారు. పెడన ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉప్పాల రమేష్‌(రాము)కు ఒక ఓటు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావుకు మరోక ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆకాంక్షించారు. కామెశ్వరితో పాటు వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు బందారు మల్లికార్జునరావు, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు శిరివెళ్ల జయేష్‌, కొనకం కరుణకుమారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు

ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: పార్టీలు, జెండాలు మార్చుతూ ఆ పార్టీలోని నాయకులకు పదే, పదే అన్యాయం చేస్తున్న మండలి బుద్ధప్రసాద్‌కు ప్రజలే గుణపాఠం చెప్పాలని అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నియోజకవర్గంలో అవనిగడ్డ నుంచి మోపిదేవి మీదుగా చల్లపల్లికి శుక్రవారం సాయంత్రం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌ సీపీ మండల పార్టీ కన్వీనర్‌ గరికిపాటి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండల బీసీ కన్వీనర్‌ రాజులపాటి నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి మొర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ గజమాలను ఎమ్మెల్యే సింహాద్రి, యువనేత సింహాద్రి వికాస్‌బాబు, చైతన్యబాబులకు వేసి స్వాగతం పలికారు. అనంతరం మోపిదేవి నుంచి వెంకటాపురం మీదుగా చల్లపల్లికి బైక్‌ ర్యాలీ నిర్వహించారు.

ఘంటసాల : సింహాద్రి రమేష్‌ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మెం సిద్ధం రోడ్డు షోకు ఘంటసాల మండలం నుంచి వైఎస్సార్‌ సీపీ శ్రేణులు బైక్‌ ర్యాలీగా



మాట్లాడుతున్న రమేష్‌బాబు, చంద్రశేఖరరావు

తరలి వెళ్లారు. మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ వేమూరి వెంకట్రావు, జేసీఎస్‌ కన్వీనర్‌ ప్రవీణ్‌ వర్కువెళ్లంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్‌ మండల అధ్యక్షులు పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.

చల్లపల్లి: సీఎం జగన్‌ మోహన్‌ రెడ్డి నమ్మకం, నిబద్ధతకు ప్రతిరూపం అని వైఎస్సార్‌ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. శుక్రవారం రాత్రి చల్లపల్లిలో రమేష్‌ బాబు ఆధ్వర్యంలో రోడ్‌ షో నిర్వహించారు. సింహాద్రి వికాస్‌బాబు, కడవకొల్లు చైతన్య, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్‌ డైరెక్టర్‌ మేడూరు మొర్సలీనా, వక్కలగడ్డ సర్పంచ్‌ వల్లూరు ఉమా తదితరులు పాల్గొన్నారు.

అందరినీ అక్కున చేర్చుకునే జగనన్న

పెదకళ్లేపల్లి(మోపిదేవి): నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ అందరినీ అక్కున చేర్చుకున్న ఒకే ఒక్క నాయకుడు మన జగనన్న అని అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌ బాబు తనయుడు యువనేత సింహాద్రి వికాస్‌బాబు అన్నారు. పెదకళ్లేపల్లి ఎస్సీవాడలో టీడీపీకి చెందిన పలువురు మహిళలు వైఎస్సార్‌ సీపీలో చేరారు. యువనేత వికాస్‌బాబు పార్టీలో చేరిన 50 కుటుంబాలకు వైఎస్సార్‌ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పురిటిగడ్డ నాగేంద్రం, పద్మ, రమ, కుమారి, నాగమణి, దొండపాటి గ్రేసమ్మ, జనుకుల్లి నాగమణి, నడకుదురు బుజ్జి, రత్నమ్మ తదితరులు పార్టీలో చేరారు. మండల పార్టీ కన్వీనర్‌ గరికిపాటి వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్‌ పుటిగడ్డ రాజబాబు, సచివాలయ గ్రామ కన్వీనర్‌ అరజా వెంకట వలవతిరావు, పురటిగడ్డ సుధీర్‌, తలపుల సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.



పథకాల్లో ఎస్సీలకు ప్రాధాన్యం



కొత్తపల్లి ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న అవిర్నేని ప్రపూర్ణచంద్‌, ఇతర నేతలు

కొత్తపల్లి(ఘంటసాల): జగనన్న అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో ఎస్సీలకు ప్రాధాన్యమిచ్చి వారికి ఆర్థిక భరోసా కల్పించారని వైఎస్సార్‌ సీపీ నేత అవిర్నేని ప్రపూర్ణ చంద్‌ అన్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లి, చిట్టూర్పు శివారు ఈపూరివారిగూడెం, నేతాజీనగరం, బీసీ కాలనీ, మల్లంపల్లి శివారు బోల్లాపాడు గ్రామాల్లో వైఎస్సార్‌ సీపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో జగనన్న నవరత్నాల ద్వారా అందించిన సంక్షేమం, అభివృద్ధి పథకాలు వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదిస్తే నవరత్నాలు ప్లస్‌ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌ బాబుకు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావులకు రెండు ఓట్లు సీలింగ్‌ ఫ్యాన్‌ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అవిర్నేని హర్షవర్ధన్‌, సర్పంచ్‌ గూడపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ కొలుసు యూస్టీ లక్ష్మీ, తాడేపల్లి కృష్ణారావు, దోనె వెంకటేశ్వరావు, యద్ద బాల్లి, కండ్రిగ లక్ష్మి, యద్ద వెంకటేశ్వరరావు, పూర్ణ, యోగేశ్వరరావు, తుమ్మల కోటేశ్వరరావు, బుజ్జి, పల్లికొండ కుమారకిరణం, దాసరి వసంత కుటుంబరావు, పరుచూరి రామకృష్ణ, రాజా, మల్లంపెద్ది శివాజీ, పోలవరపు రమేష్‌, కుంపటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి ఇంటింటా ప్రచారం

బందలాయిచెరువు(అవనిగడ్డ): బందలాయిచెరువులో వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన గడపగడపకు వెళ్లి పార్టీ మేనిఫెస్టో, బ్యాలెట్‌ నమూనా అందజేశారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. రెండు బ్యాలెట్‌ పేపర్లలో 3వ నెంబర్‌పై ఉన్న ఫ్యాన్‌ గుర్తుకు ఓటేసి తనను, మచిలీపట్నం పార్లమెంటరీ అభ్యర్థి డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావుని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అమలు కాని హామీలు ఇస్తున్న చంద్రబాబు, కూటమి నేతల మాటలు నమ్మొద్దని, వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌ గాజుల జయరామ్‌రావ్‌, నేతలు రామచంద్రరావు, గాజుల రాంబాబు(రాముడు), రవి, దామోదర్‌ తదితరులు పాల్గొన్నారు.



బందలాయి చెరువులో ప్రచారం చేస్తున్న సింహాద్రి రమేష్‌బాబు